అర్హులందరికీ ఇండ్లు వచ్చేలా చూడాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, డిసెంబర్ 28: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. ఈ మేరకు శనివారం ఆమె బీఆర్ఎస్ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, దరఖాస్తుల్లోని వివరాలు ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వివరాలు పేపర్లకే పరిమితం కాకుండా సమీక్ష చేసి అర్హులందరికీ అన్ని పథకాలు అందజేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శీలం ప్రియాంక-ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ రావు, తుమ్మ గంగాధర్, అనిల్, మల్లేశ్, స్పందన, పడిగెల గంగారెడ్డి, రత్నాకర్‌రావు, హన్మాండ్ల మహేశ్, గంగారాం, లక్ష్మణ్ రావు, హరీశ్, బాలే చందు, గడ్డం గంగారెడ్డి, సంహిత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణను సన్మానిస్తున్న తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు చేయాలి

జగిత్యాల రూరల్, డిసెంబర్ 28: ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి జూనియర్ కళాశాల లెక్చరర్ 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సక్రమంగా అమలు చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో శనివారం ఆయనను తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711 జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ మాట్లాడుతూ, ఇంటర్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సయ్య, డాక్టర్ తిరుపతి, రాజేశ్, విజేందర్, ప్రమోద్ కుమార్, నర్సయ్య, రాజేందర్, రవీందర్, దేవేందర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బాలు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేటకు చెందిన జంగిటి నవీన్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. అలాగే, ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామానికి చెందిన కాతం జమున ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు బాబు, అమ్ములు, రాహుల్, రాజేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గ్రామస్తుడిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28 : ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మెడికవర్ దవాఖాన వైద్యులు శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుడు కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల మీన రమేశ్, నల్ల రామ్‌రాజ్, మున్నూరుకాపు సంఘం యువజన విభాగం అధ్యక్షుడు దాసరి పెద్ద నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోర్గం రాజు, నాయకులు గూడ శ్రీకాంత్, చల్ల పురుషోత్తం, మెడికవర్ వైద్య సిబ్బంది కోట కరుణాకర్, చంద్రశేఖర్, మున్నూరుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణంలోని రెనే దవాఖానలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది యువకులు రక్తదానం చేసినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి బత్తిని అనుదీప్ తెలిపారు. ఇక్కడ వైద్యులు సమీర్, సిబ్బంది అకిఫ్, నవీన్, పాషా, లత, వనజ, రాజేశ్వరి తదితరులున్నారు.

PUBLIC NOTICE

My client by name **ENAGANTI LAXMAN,** S/o. GATTAIAH, Age: 35 years, Occ: SCCL Employee. R/o, H.No. 14-90, Hanuman Nagar, Singapur, Mdl. Naspur, Dist.: Mancherial, he has lost his land original registered link. Document No. **840/2011, Dt. 08-04-2011,** which were registered before SRO Sulthanabad at Velgatoor Bus Stand, while he was travelling to Srirampur from Velgatoor on 03-10-2024, he tried to trace out the same but in vain, If any one find the above said document, they shall have handover the same to me. He approaches Telangana Grameena Bank, Singapur Branch for obtaining loan and also anyone is having any objections about the property covered under Register Sale Deed inform to the below address within one weak from the date of publication otherwise the Bank will proceed further.

SCHEDULE OF PROPERTY

House plot No. 56, an extent of 395 Sq.Yds = 331.80 Sq.Meters situated in Sy No. 300 of Endapalle Shivar. Within the limits of Rajarampalle Gram Panchayath, Md: Velgatoor, Dist Jagtial

BOUNDARIES:

East Plot of Devi Chandramouli (Plot No. 57).
West: 18 Feet Wide Road
North: Land of Aeleti Keshava Reddy,
South: 8 Feet Wide Road

Sd/- **N. KAMALA MANOHAR RAO,**
Advocate
4-197, Near LIC Office, MANCHERIAL. Cell: 98495 81977

లే అవుట్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

లే అవుట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

మెట్‌పల్లి, డిసెంబర్ 28: పట్టణంలోని సాయిరాం కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన లే-అవుట్ స్థలాన్ని శనివారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. నిబంధనల ప్రకారం అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక వసతుల ఏర్పాటును తనిఖీ చేశారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు పకడ్బందీగా సర్వే చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మోహన్, సిబ్బంది ఉన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరన్

కోరుట్ల రూరల్, డిసెంబర్ 28: ఉపాధి హామీ పనులను నాణ్యతతో చేపట్టాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 15 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 1-4-2023 నుంచి 31-3-2024 వరకు చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 15 గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల వివరాల రికార్డులను పరిశీలించారు. మొత్తం పనుల విలువ రూ.2,32,21,955కి గానూ కూలీలకు రూ.2,16,31,127, సామగ్రికి రూ.15,90,828 చెల్లించారు. ఈ పనుల్లో సక్రమంగా చేపట్టని వాటికి రూ.23,473 రికవరీకి ఆదేశించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో కూలీలకు ఇబ్బందులు కలిగించవద్దని, పనుల ఎంబీ రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని, చేసిన పనులకు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కూలీల రోజు వారి వివరాలు నమోదు చేసి, వేతనాలు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవో మదన్, ఏడీవీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో వోదెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, ఏపీవో మమత, సీవో రాజేందర్, సీఏలు దారా సింగ్, గంగరాధ, స్రవంతి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28 : ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్‌లో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మెడికవర్ దవాఖాన వైద్యులు శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యుడు కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల మీన రమేశ్, నల్ల రామ్‌రాజ్, మున్నూరుకాపు సంఘం యువజన విభాగం అధ్యక్షుడు దాసరి పెద్ద నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోర్గం రాజు, నాయకులు గూడ శ్రీకాంత్, చల్ల పురుషోత్తం, మెడికవర్ వైద్య సిబ్బంది కోట కరుణాకర్, చంద్రశేఖర్, మున్నూరుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

పెగడపల్లి, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి బోయిన్‌పల్లి శాంతపురావు శనివారం రూ.40 వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ అందజేశారు. ఇక్కడ రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి నర్సింగరావు, హెచ్ఎం లలిత, ఉపాధ్యాయుడు లచ్చయ్య, పీడీ రమేశ్, మాజీ వార్డు సభ్యుడు శాంతపురావు తదితరులున్నారు.

బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

పెగడపల్లి, డిసెంబర్ 28: మండలంలోని ఆరవల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సూత్రపు శ్రీనివాస్ (45) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. శ్రీనివాస్ మృతి పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, తాజా మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, నాయకులు సంతాపం తెలిపారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన

మాట్లాడుతున్న ఎస్ఐ గీత

జగిత్యాల, డిసెంబర్ 28: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో ఎస్సీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం సభ్యులు యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలు, షీ టీం, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల టౌన్ ఎస్ఐ గీత మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సెల్‌ఫోన్ విని యోగించవద్దన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌చార్జి సౌజన్య మాట్లాడుతూ, హ్యూమన్ ట్రాఫికింగ్‌తో కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరిచరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత, రజిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువైద్యాధికారికి సత్కారం

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 28: ఇటీవల కిసాన్ సేవా రత్న జాతీయ పురస్కారం అందుకున్న మెట్‌పల్లి మండల పశు వైద్యాధికారిణి మనీషా పటేల్‌ను సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో మనీషా పటేల్‌ను శనివారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ఎల్ మనోహర్, ఏడీ డాక్టర్ నరేశ్, జిల్లాలోని పశువైద్యాధికారులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు బహూకరించి అభినందించారు.

సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలి

మేడిపల్లి, డిసెంబర్ 28: ఆయిల్ పామ్ చెట్లు, డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో షాహిద్ అలీ సూచించారు. మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన తొగరి దేవయ్య తన భూమిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ చెట్లను శనివారం ఆయన పరిశీలించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు ఏఈవోలు, హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సురేందర్‌నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణంలోని ఐబీ రోడ్డులో శనివారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన కంభంపాటి వినయ్ (34) కోరుట్లలోని ఐబీ రోడ్డులో ఓ అద్దె ఇంట్లో నాలుగు నెలలుగా నివసిస్తున్నాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వినయ్‌కి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలను సందర్శించిన జిల్లా విద్యాధికారి

కొడిమ్యాల, డిసెంబర్ 28: కొడిమ్యాల, నాచుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీని శనివారం జిల్లా విద్యాధికారి రాములు సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంఈవో శ్రీనివాస్, తదితరులున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాయికల్, డిసెంబర్ 28: రాయికల్ మండలం వస్తాపూర్ గ్రామానికి చెందిన షేక్ మోహిత్ (19) ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురికాగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సుధీర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ మోహిత్ ఈనెల 21న ట్రాక్టర్‌లో మొరం తీసుకెళ్తుండగా, కట్కాపూర్ గ్రామ శివారులో ఎత్తుగడ్డ ఎక్కించే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంజిన్, ముందు టైర్లు పైకి లేచి రివర్స్‌గా తనపై పడడంతో అందులో ఇరుక్కొని తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మోహిత్ తండ్రి షేక్ ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. జగిత్యాలలోని ప్రభుత్వ దవాఖానలో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు.

కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలి

కోరుట్ల, డిసెంబర్ 28: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించే కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, మార్కెట్‌లో కోడిగుడ్డు ధర రూ. 7 పలుకుతుండగా, ప్రభుత్వం కేవలం రూ. 5 మాత్రమే అందిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కోడిగుడ్డుకు రెండు రూపాయలు నష్టాన్ని భరించడం కార్మికులకు సాధ్యం కాదన్నారు. రాష్ట్ర యూనియన్ తీర్మానం మేరకు ప్రభుత్వం కోడిగుడ్లను సరఫరా చేస్తేనే వండి పెడతామని, లేదంటే వడ్డించలేమని తేల్చి చెప్పారు. అనంతరం ఈ మేరకు ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, యూనియన్ సభ్యులు రాజగంగు, చంద్రకళ, పుష్పలత, అమృత, లత, సంగెం పద్మ, భాగ్యలక్ష్మి, హరిక తదితరులున్నారు.

మాజీ ప్రధానికి ఘన నివాళి

జగిత్యాల/రూరల్/అర్బన్/మల్లాపూర్, డిసెంబర్ 28: పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల మహిళా సమాఖ్య సభ్యులు, ఐకేపీ సిబ్బంది శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జగిత్యాల రూరల్, అర్బన్ మండల మహిళా సమాఖ్యల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, రవీందర్, గంగారాం, శ్రీనివాస్, మండల సమాఖ్య సభ్యులు మారు సత్తవ్వ, దేశవేని గంగాభవాని, శ్రీలత, జమున, సునీత, భారతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్, పాలకవర్గ సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుర్గయ్య, దాసరి లావణ్య, ప్రవీణ్, పద్మ, క్యాగాసు నవీన్, సాగర్, శ్రీలత-రామ్మోహన్ రావు, చుక్క నవీన్, లత-జగన్, మేక పద్మావతి-పవన్, ముస్కు నారాయణరెడ్డి, పంబాల రాము, బాలె శంకర్, నక్క జీవన్, కూతురు రాజేశ్, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం పాల్గొన్నారు. మల్లాపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి టీపీసీసీ నేత జువ్వాడి కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడ్పుల నర్సయ్య, నల్ల బాపురెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్, గడ్డం లక్పతి, నల్ల రాజ రెడ్డి, నూతిపల్లి రాజం, తదితరులున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సత్కారం

కోరుట్ల, డిసెంబర్ 28: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోగిల సత్యనారాయణ ఉద్యోగ విరమణను పురస్కరించుకొని శనివారం గిరిజన ఉపాధ్యాయ సంఘం, యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా సత్యనారాయణకు భగవద్గీత బహూకరించారు. ఇక్కడ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల స్వామి, టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కెమాగ్స్ అధ్యక్షురాలికి సత్కారం

కోరుట్ల, డిసెంబర్ 28: కోరుట్ల, మెట్‌పల్లి అబ్‌స్టేషన్, గైనకాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (కేమాగ్స్) అధ్యక్షురాలిగా ఎన్నికైన పట్టణానికి చెందిన కోరుట్ల నర్సింగ్ హోమ్ నిర్వాహకురాలు డాక్టర్ స్వీతి అనూప్ రావును శనివారం ఎంఐఎం నాయకులు సన్మానించారు. ఇక్కడ వైద్యులు అనూప్‌రావు, రీతూరావు, నిశ్చల్ రావు, ఎంఐఎం పట్టణాధ్యక్షుడు రఫీ, నాయకులు వాజిద్, రహీం, హఫీజ్, మజార్, రవుఫ్, సమీర్, చాంద్, ముజాహిద్, ఫయాజ్, నిజాం, తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి

జగిత్యాల రూరల్, డిసెంబర్ 28: గొల్లపల్లి మండలం బీబీరాజ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాసమల్ల తిరుపతి అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం మృతుడి స్వగ్రామం లక్ష్మీపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. తిరుపతి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ టీజీవో అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, గొల్లపల్లి ఎంపీవో సురేశ్, కార్యదర్శులు, తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలో రెచ్చిపోతున్న ఆకతాయిలు

- విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి యత్నం

జగిత్యాల, డిసెంబర్ 28: జిల్లా కేంద్రంలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి యత్నించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం రాత్రి కస్టమర్‌కు, సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. బంక్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విచారణకు వచ్చిన పోలీసులపై ఆకతాయిలు దాడికి పాల్పడ్డారు. పెట్రోల్ బంక్‌లో విధ్వంసానికి యత్నించారు. దాడికి పాల్పడ్డ వ్యక్తులను రక్షించే ప్రయత్నంలో నియోజకవర్గ కీలక ప్రజాప్రతినిధి కీలకంగా వ్యవహరించాడు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా యత్నించడమే కాకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చి స్టేషన్ బెయిల్ ఇప్పించినట్లు సమాచారం. విధులకు ఆటంకం కలిగించారని టౌన్ ఎస్ఐ గీత కేసు నమోదు చేశారు. బోదుకాని శేఖర్, తమ్మ గంగారాంపై కేసు నమోదు కాగా, కీలక ప్రజాప్రతినిధి ఒత్తిడితో స్టేషన్ బెయిల్ ఇచ్చి పోలీసులు చేతులు దులుపుకున్నట్లు సమాచారం.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సారంగాపూర్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

సారంగాపూర్/కొడిమ్యాల, డిసెంబర్ 28: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పులి మల్లేశం డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు రెండో రోజు టోకెన్ సమ్మె చేపట్టి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పులి మల్లేశం మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు సవరించాలని కోరారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్ నెరవేర్చకుంటే జనవరి 4 నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంపీడీవో చౌడారపు గంగాధర్‌కు పంచాయతీ కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గంగారాం, గంగలచ్చన్న, కొండయ్య, రాజన్న, దుబ్బయ్య, లక్ష్మీరాజం, పోశాని, పోచవ్వ, నిర్మల, గంగమ్మ, లక్ష్మి, బక్కవ్వ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు టోకెన్ సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మకుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, కార్మికులు సత్తయ్య, దేవయ్య, రేఖ, నవీన, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సహా తల్లి ఆత్మహత్యా యత్నం

ధర్మపురి రూరల్, డిసెంబర్ 28: ధర్మపురి మండలం రాయపట్నం వద్ద గోదావరిలో దూకి పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోబోయిన ఓ మహిళను పోలీసులు కాపాడి భర్తను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. వివరాల్లోకి వెళ్తే... జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిప్ప మౌనిక శనివారం తన ఇద్దరు పిల్లలతో కలిసి రాయపట్నం వంతెన వద్దకు వచ్చింది. వంతెన వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించిన పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భర్తతో గొడవ పడి వచ్చానని, గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నానని తెలిపింది. దీంతో పోలీసులు మౌనిక భర్త అరుణ్‌కుమార్‌ను పిలిపించి ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసుల దాడి

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 28: మండలంలోని మెట్లచిట్టాపూర్, జగ్గసాగర్ గ్రామాల్లో బెల్టు దుకాణాలపై మెట్‌పల్లి ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. జగ్గసాగర్‌లోని బెల్టు దుకాణం నుంచి సుమారు రూ. ఆరు వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మెట్లచిట్టాపూర్‌లోని బెల్టు దుకాణం నుంచి విస్కీ బాటిళ్ల శాంపిళ్లను తీసుకెళ్లినట్లు తెలిసింది.

##